# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ డిసెంబర్ 09 సోమవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 138

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం



# ఆకాశంలో కళ్లు చెదిరేలా
# విమానాల విన్యాసాలు..

**ఆకాశంలో కళ్లు చెదిరేలా విమానాల విన్యాసాలు.. నేలపై జనం కేరింతలతో ఆదివారం సాయంత్రం హుస్సేన్‌సాగర్ పరిసరాలు హోరెత్తాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఏరోబాటిక్ ప్రదర్శన.. ప్రత్యక్షంగా వీక్షించిన నగరవాసులను ఆకట్టుకుంది.**



హైదరాబాద్: ఆకాశంలో కళ్లు చెదిరేలా విమానాల విన్యాసాలు.. నేలపై జనం కేరింతలతో ఆదివారం సాయంత్రం హుస్సేన్‌సాగర్ పరిసరాలు హోరెత్తాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఏరోబాటిక్ ప్రదర్శన.. ప్రత్యక్షంగా వీక్షించిన నగరవాసులను ఆకట్టుకుంది. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా 9 విమానాలతో భారత వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ బృందం ప్రదర్శించిన విన్యాసాలు ఒళ్లు గగుర్పొడిచేలా సాగాయి. దాదాపు 25 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా, రోమాంచితంగా సాగాయి.



2లో..

## శత్రుదుర్భేద్యంగా సరిహద్దులు

దేశ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు.

## మారథాన్‌కు వెళ్తూ మృత్యువాత

గజ్వేల్:వారిద్దరూ మారథాన్ స్నేహితులు. కానిస్టేబుళ్లు అయిన ఆ ఇద్దరు మిత్రులు ఎక్కడ మారథాన్ జరిగినా పాల్గొని అందరినీ ఆకట్టుకునేవారు. హైదరాబాద్‌లో జరగనున్న మారథాన్‌లో పాల్గొనేందుకు వెళ్తున్న వీరిని విధి రోడ్డుప్రమాదం రూపంలో కబళించింది. ఈ విషాద ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు గ్రామానికి చెందిన వర్కల్ పరంధాములు(43) రాయపోల్ పోలీస్‌స్టేషనులో, సిద్దిపేట అర్బన్ మండలం గాడిచర్లపల్లి గ్రామానికి చెందిన పూస వెంకటేశ్వర్లు(42) దౌల్తాబాద్ ఠాణాలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్ ఈసీఐఎల్‌లో జరగనున్న మారథాన్‌లో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం వీరిద్దరు దౌల్తాబాద్ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని గజ్వేల్‌లోని జాలిగామ రోడ్డు వద్ద ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలపాలైన వారిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మారథాన్ గెలవడమే లక్ష్యంగా ఇంటి నుంచి ఉత్సాహంగా బయలుదేరిన ఇద్దరు మిత్రులు రోడ్డుప్రమాదంలో మృత్యువాత పడటం కుటుంబసభ్యులు, పోలీసులు, క్రీడాకారుల్లో విషాదం నింపింది. పరంధాములు(2004వ బ్యాచ్), వెంకటేశ్వర్లు(2007వ బ్యాచ్) గతంలో సిద్దిపేటలో పదేళ్ల పాటు కలిసి పనిచేసి మంచి స్నేహితులయ్యారు.



**వారిద్దరూ మారథాన్ స్నేహితులు. కానిస్టేబుళ్లు అయిన ఆ ఇద్దరు మిత్రులు ఎక్కడ మారథాన్ జరిగినా పాల్గొని అందరినీ ఆకట్టుకునేవారు. రోడ్డుప్రమాదంలో ఇద్దరు కానిస్టేబుళ్ల దుర్మరణం సిద్దిపేట జిల్లాలో విషాదం**

# రైతుల పాదయాత్ర అడ్డగింత

తమ సమస్యలపై గళమెత్తడానికి పాదయాత్ర ద్వారా ఢిల్లీకి చేరుకోవాలని 101 మంది రైతుల బృందం మరోసారి చేసిన ప్రయత్నాన్ని హరియాణా భద్రతా బలగాలు ఆదివారం అడ్డుకున్నాయి.



2లో

**పంజాబ్-హరియాణా సరిహద్దులో బాష్పవాయు ప్రయోగం వారిని వెనక్కు పిలిపిస్తామన్న రైతుల నేత**



2లో

# ఏడాది పాలన.. ఎడతెగని వంచన

- సీఎం రేవంత్ అజ్ఞానంతో దేశం ముందు రాష్ట్రం నవ్వులపాలు
- మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు
- పెరిగిపోయిన రాజకీయ కక్ష సాధింపు చర్యలు
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు.. కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్





# ఇంటింటికీ ‘మీసేవా’

## నాలుగు సంస్థలు.. రూ.7,592 కోట్లు..

- 5,200 మందికి ఉపాధి కల్పించేలా పెట్టుబడుల ఒప్పందాలు
- తొలివిడతగా 12 ఎంఎస్ఎంఈ పార్కులు
- పారిశ్రామికీకరణతో యువతకు ఉపాధి
- అనుమతులు వచ్చిన వెంటనే పల్లెల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు
- ప్రజాపాలన విజయోత్సవాల్లో మంత్రి శ్రీధర్‌బాబు

2లో

**తెలంగాణను పెట్టుబడులకు స్వర్గధామంగా, దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. పెట్టుబడులతో యువతకు ఉపాధి కల్పించి తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్‌ను మరింత పెంచుతామన్నారు. పారిశ్రామిక పెట్టుబడుల ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు జారీ చేస్తున్నట్లు వివరించారు.**

వేగుచుక్క



## ఏడాది పాలన.. ఎడతెగని వంచన

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలున ఎడతెగని వేదనను మిగిల్చిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. కాయిగ్రెస్ పాలన అంతా పరపీడన పరాయణత్వంలా మారిందని విమర్శించారు. భావ ప్రకటనా స్వేచ్ఛును కాపాడుతామని అధికారంలోకి వచ్చి.. ఏడాదిలోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందుని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరుగని నిర్బంధకాండను రేవంత్ ప్రభుత్వం అమలుచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలునపై ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు చార్జిషీట్ విడుదల చేశారు. త్వరలో ప్రభుత్వంలో జరుగుతున్న కుంభకోణాలపై మరో చార్జ్షీట్ విడుదల చేస్తాుమని ప్రకటించారు. 'సీఎం సొంత ఊరికి ఎవరైనా వెళ్లాలంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసువాల్సిన పరిస్థితి. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చి ఎమర్జెన్సీని తలపిస్తున్నాడు'అని మండిపడ్డారు.

శ్వేతపత్రాల పేరిట రోత పత్రాలు..

'రేవంత్ పాలన ప్రతికూల దృక్పథంతో ప్రారంభం కావడంతో ప్రతికూల ఫలితాలే వస్తున్నాయి. శ్వేతపత్రాల పేరిట రోత పత్రాలు విడుదల చేసి రాష్ట్రం దివాలా తీసిందనే నెగెటివ్ ఇమేజ్ సృష్టించారు. రేవంత్ మార్పు పాలన దేశం ముందు నవ్వుల పాలైంది. ప్రభుత్వ క్రశాఖల మధ్య సమన్వయం లేదు. సీఎం నిర్వహిస్తున్న శాఖల్లోనే పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెచ్చుమీరాయి.

కృష్ణా నది ప్రాజెక్టులపై పదేండ్లు కేసీఆర్ కాపాడిన హక్కులను.. అధికారంలోకి వచ్చి నెల తిరక్కుండానే కేంద్రానికి కట్టబెట్టారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగితే, రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగింది. రైతు సంక్షేమానికి రాహుకాలం.. వ్యవసాయునికి గ్రహణం పట్టింది. బడిలో చదువుకోవాల్సిన పిల్లలు ఆసుపత్రుల్లో కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు. హైడ్రా రూపంలో రేవంత్ రెడ్డి విధ్వంసం సృష్టించారు. మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిక్క విధానం, తిట్ల పురాణం అవలంబిస్తున్న సీఎంకు దుర్భాష దురంధరుడు అనే బిరుదు ఇవ్వవచ్చు'అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.'

## శత్రుదుర్భేద్యంగా సరిహద్దులు



జోధ్‌పూర్: దేశ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు త్వరలో సమగ్ర యాంటీ డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇటీవలి కాలంలో పాకిస్థాన్‌తో నియంత్రణ రేఖ వెంబడి డ్రోన్ల అనుమానాస్పద కదలికలు భద్రతా బలగాలకు సవాలు విసురుతున్నాయి. ఈ డ్రోన్లు చాలావరకు ఆయుధాలు, మాదకద్రవ్యాలను మోసుకెళ్తున్నట్లు బలగాలు గుర్తించాయి. ఈ క్రమంలోనే యాంటీ డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అమిత్ షా తెలిపారు. రాజస్థాన్‌లోని జోధ్‌పుర్‌లో ఆదివారం బీఎస్ఎఫ్ 60వ రైజింగ్ డే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బలగాలను ఉద్దేశించి ప్రసంగించారు. లేజర్‌తో కూడిన యాంటీ డ్రోన్ గన్ మౌంటెడ్ మెకానిజం ప్రాథమిక ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని తెలిపారు. దీనిద్వారా పంజాబ్‌లోని భారత్ – పాక్ సరిహద్దులో ప్రత్యర్థి డ్రోన్ల గుర్తింపు, కూల్చివేతల కేసులు 3 నుంచి 55 శాతానికి పెరిగాయని వెల్లడించారు. "రానున్న రోజుల్లో డ్రోన్ల బెడద మరింత పెరగనుంది. ఈ సమస్య పరిష్కారానికి డీఆర్డీవో, ఇతర రక్షణ, పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. త్వరలో సమగ్ర యాంటీ డ్రోన్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో దేశ సరిహద్దులను శత్రుదుర్భేద్యం చేసేందుకు కొనసాగుతున్న 'సమగ్ర సమీకృత సరిహద్దు నిర్వహణ వ్యవస్థ' (సీఐబీఎంఎస్) పురోగతిలో ఉంది. ఉత్తరాది సరిహద్దు గ్రామాల అభివృద్ధికి ఉద్దేశించిన 'వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రాం'ను దేశంలోని అన్ని సరిహద్దు పల్లెలకు అమలు చేయనున్నాం. దాదాపు 3,000 గ్రామాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నాం.

### దుబారాలపై నోరుమెదపని
## పాలకులు !

గతంలో కెసిఆర్ అధికారంలోకి రాగానే సకలజనుల సర్వే చేపట్టారు. అందులో ప్రజల వివరాలు అన్నీ నమోదయ్యాయి. వాటిని ఏం చేశారో తెలియదు. ఇప్పుడు కొత్తగా బిసి గణన అంటున్నారు. కొత్తగా రేషన్ కార్డులు అంటున్నారు. ఇలా సర్వేలతో కాలం గడిపే బదులు ప్రజలకు ఏదైనా ప్రొఫార్మా అందిస్తే వారే గ్రామస్థాయిలో తమ ఆదాయ వ్యవయాలు, కులవృత్తులు, ఆస్తులు వంటి వివరాలు తెలియ చేస్తారు. ప్రజల ఆర్థిక పరిస్థితి తెలుసుకుని పథకాలు అమలు చేయాలి. అప్పుడే పేదరిక నిర్మూలన జరగగలదు. రాష్ట్రం ఏదైనా ఆర్థిక సమర్థత ఎంతన్నది బేరీజు వేయాలి. ఇల్లు మొదలకుని అన్ని వ్యక్తిగత వివరాలు సేకరించాలి. తెలంగాణలో కొత్త రేసన్ కార్డులకు తెరలేపారు. ఇప్పుడు ఇళ్లు, కార్డులు అనగానే ప్రతి ఒక్కరూ అర్హులమే నని తమ వివరాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీనికి ప్రాతిపదిక ఏదైనా పక్కాగా వివరల సేకరణ జరగాలి. అప్పుడే అసలుసిసలు లబ్దిదారులకు న్యాయం జరగగలదు. ఇక బియ్యం పథకాన్ని తీసుకుంటే కిలో రూపాయి బయ్యం పథకంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దుబారా జరుగుతోంది.

## రైతుల పాదయాత్ర అడ్డగింత

శంభు, చండీగఢ్: తమ సమస్యలపై గళమెత్తడానికి పాదయాత్ర ద్వారా దిల్లీకి చేరుకోవాలని 101 మంది రైతుల బృందం మరోసారి చేసిన ప్రయత్నాన్ని హరియాణా భద్రతా బలగాలు ఆదివారం అడ్డుకున్నాయి. ఒకదశలో వారిపైకి బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. పంజాబ్–హరియాణా సరిహద్దులోని శంభు వద్ద నిరసనలు తెలియజేస్తున్న రైతుల్ని దిల్లీకి రాకుండా నిలువరించేందుకు బహుళ అంచెల్లో అడ్డంకులు ఏర్పాటు చేశారు. దేశ రాజధాని ప్రాంత పరిపాలన యంత్రాంగం నుంచి అనుమతి పొందిన తర్వాతే దిల్లీకి వెళ్లాలని ఇప్పటికే పోలీసులు వారికి తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. మర్‌జీవ్రాస్ (ఒక కారణం కోసం ప్రాణత్యాగం చేసేవారు)గా తమను తాము పేర్కొంటున్న రైతుల బృందం ఆదివారం దిల్లీ దిశగా ముందుకు కదలగానే కొన్ని మీటర్ల దూరంలోనే వారిని పోలీసులు అడ్డుకున్నారు. వాగ్వాదం పెరగడంతో పోలీసులు బాష్పవాయువుతో పాటు



జలఫిరంగుల్ని ప్రయోగించి చెదరగొట్టారు. తాజా పరిణామంతో 101 మంది రైతుల్ని వెనక్కి పిలిపిస్తున్నట్లు రైతుల నేత సర్వాన్‌సింగ్ పంధేర్ తెలిపారు. తమ నిరసనలు ఆదివారంతో 300 రోజులకు చేరాయని, తదుపరి కార్యాచరణపై సోమవారం అన్ని సంఘాలు సమావేశమై చర్చించుకుంటాయని చెప్పారు. ఎలాంటి ఆయుధాలు, వాహనాలు లేకుండా శాంతియుతంగా కాలినడకన ముందుకు వెళ్తున్నవారిని ఎందుకు అడ్డుకుంటున్నారని మరో నేత తేజ్‌వీర్‌సింగ్ ప్రశ్నించారు. తమ డిమాండ్లను కేంద్రం ఆమోదిస్తే ఇలాంటి ఆందోళనే అవసరమయ్యేది కాదన్నారు.

## రాష్ట్రస్థాయి ఇన్ స్పైర్ ప్రదర్శనకు "సత్య-శోధక్" ప్రాజెక్ట్.

- సంతోషం వ్యక్తం చేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, డిసెంబర్ 8:**

రాష్ట్ర స్థాయి ఇన్ స్పైర్ ప్రదర్శనకు సత్యశోధక్ పాఠశాల చెందిన విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపిక అయ్యింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా (గురువారం నుండి శనివారం వరకు ) జరిగిన జిల్లా స్థాయి ఇన్ స్పైర్ మానక్ వైజ్ఞానిక ప్రదర్శనలో సత్యశోధక్ పాఠశాలకు పాఠశాల గైడ్ టీచర్స్ జీవన్, సతీష్ ల సహకారంతో విద్యార్థి యం. సుశాంత్ (8వ తరగతి) రూపొందించిన సౌరశక్తి ఆధారిత ట్రాక్టర్ వ్యవసాయం (ఫార్మింగ్ విత్ సోలార్ ట్రాక్టర్ ) ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికకావడం జరిగింది. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి సుశాంత్ కు జిల్లా విద్యాధికారి పి.అశోక్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ ప్రత్యేక జ్ఞాపికను, ప్రశంస పత్రాన్ని అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతంలోని రైతులకు సాంకేతిక నైపుణ్యంతో సౌరశక్తి, మొబైల్ సహకారంతో ట్రాక్టర్ నడుపుతూ వ్యవసాయం చేయుటకు ఉపయోగపడే ప్రాజెక్ట్ తయారుచేసి జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం సంతోషదాయకమని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థి సుశాంత్ కు మరియు సంపూర్ణ సహకారం అందించిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.





## తెలంగాణ సాహిత్య అస్తిత్వానికి కార్యాచరణ.

- తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్.

**వేగుచుక్క న్యూస్, హైదారాబాద్, డిసెంబర్ 8:**



తెలంగాణ అస్తిత్వ సాహిత్యం-వర్తమాన సందర్భం అనే అంశాన్ని తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభల సందర్భంగా ఎంచుకోవడం అభినందనీయమని, మేధావులంతా మేథోమధనం చేసి తెలంగాణ అస్తిత్వానికి కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన తెలంగాణ రచయితల సంఘం 10 ఏళ్ల సాహిత్య సభలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాలు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, నిఖిలేశ్వర్, డాక్టర్ నాళేశ్వరం శంకరం, వేణుగోపాల్, కందుకూరు శ్రీరాములు, జీ నరసింహ స్వామి, డాక్టర్ వి శంకర్, ముత్తిగారి కవిత తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తం

హైదరాబాద్: అధికారంలోకి వచ్చి ఏడాదికాలం పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని, ప్రభుత్వ అసమర్థత వల్ల పాలన అస్తవ్యస్తంగా మారిందని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఎక్కడికక్కడ తిరగబడుతున్నారని చెప్పారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఆదివారం ఎర్రవల్లిలోని తన నివాసంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏం సాధించారని ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తోందని కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి రూపురేఖలను మార్చి.. అస్తిత్వంపై దాడి చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరులపై ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌ను అసెంబ్లీ వేదికగా నిలదీయాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సమావేశం సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. అసెంబ్లీలో, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై వారికి ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, సీనియర్ నాయకులు హరీశ్‌రావు, మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

గిరిజనులపై కేసులు.. హైడ్రాతో కూల్చివేతలు

"లగచర్లలో ఫార్మా పరిశ్రమ పేరిట భూములను లాక్కుంటున్నారని స్థానిక గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తోంటే.. వారిపై ప్రభుత్వం కేసులు పెట్టి వేధిస్తోంది. మూసీ సుందరీకరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనారిటీల నివాసాలను కూలగొడుతోంది. హైడ్రా ముసుగులో పేదల ఆవాసాలను బుల్డోజర్లతో నిలువునా కూల్చేస్తోంది. ఇదేంటని అడిగిన భారాస నేతలపై అక్రమ కేసులు బనాయిస్తోంది. సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం



చేసింది. సముద్రంలో వృథాగా కలుస్తున్న కాళేశ్వరం జలాలను ఎందుకు ఎత్తిపోయడం లేదు? కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగుల పరిస్థితి కూడా దారుణంగా తయారైంది. వారికి అందాల్సిన 5 డీఏలకు గాను ఒక్క డీఏనే ఇచ్చింది. దాన్ని కూడా 17 వాయిదాల్లో అందిస్తామని ప్రకటించడం సిగ్గుచేటు. భారాస ప్రభుత్వ హయాంలో గురుకుల విద్యాలయాలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాం. గురుకులాలను కాంగ్రెస్ సర్కారు భ్రష్టు పట్టించింది. తినే తిండిని కూడా సరిగ్గా వండి పెట్టలేక పిల్లలకు విషాహారం పెడుతోంది. పిల్లలు చనిపోతున్న దారుణ దృశ్యాలు మనసును కలిచివేస్తున్నాయి. గురుకులాలను సక్రమంగా నడిపేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి.

తెలంగాణ తల్లి భావన యావత్ సమాజానిది..

తెలంగాణ తల్లి భావన నాది కాదు. యావత్ తెలంగాణ సమాజానిది. 70 ఏళ్ల కిందటే.. దాశరథి, రావెల్ల వెంకట్రామారావు వంటి తెలంగాణ కవులు తెలంగాణ తల్లి గురించి కీర్తించారు. ఈ సంగతి ఈ ప్రభుత్వానికి, దాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రికి తెలియదు. కేసీఆర్ పెట్టారని.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని మూర?త్వంతో

వ్యవహరిస్తున్నారు. నన్ను ఆహ్వానించడం వెనక కోణం ఏదున్నా.. వచ్చిన మంత్రికి, ఆయన వెంట వచ్చినవారికి భోజనం పెట్టి సాదరంగా

గౌరవించి పంపించాం. ఇది తెలంగాణ సంప్రదాయం. రైతుబంధును ఇంకా పెంచుతామని.. రైతులకు ఆశలు పెట్టి.. ఉన్నదాన్ని ప్రభుత్వం ఎగ్గొడుతోంది. తెలంగాణను అస్తవ్యస్తం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలి" అని కేసీఆర్ సూచించారు. గురుకులాల్లో పరిస్థితులపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో పార్టీ ఏర్పాటు చేసిన కమిటీ కేసీఆర్‌కు నివేదిక సమర్పించింది.

వేగుచుక్క

# అమెరికాలో జాబ్ వదిలేసి 100 కోట్ల టర్నోవర్..

కష్టాన్ని నమ్ముకుంటే ప్రతిఫలం ఉంటుందని ఎందరో నిరూపించారు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే కథ అలాంటిదే. ఎక్కడో రాజస్థాన్ భరత్‌పుర్‌లో పుట్టిన అహానా గౌతమ్.. అమెరికాలో జాబ్ చేసింది. తర్వాత బిజినెస్ స్టార్ట్ చేయాలనే ఆలోచనతో మంచి ఉద్యోగం వదిలేసింది. ఆ చిన్న ఆలోచనతో ఇప్పుడు ఏకంగా రూ. 100 కోట్ల విలువ గల కంపెనీని సృష్టించడం విశేషం. అదే ఓపెన్ సీక్రెట్. ఇదెలా ప్రారంభమైంది. ఇంతకీ అదేం బిజినెస్ అనేది చూద్దాం.

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అన్నాడో కవి. నిజంగానే మనం ఏదైనా కష్టపడి పనిచేస్తే విజయం దానంతటదే వస్తుందని చాలా మంది చెబుతుంటారు. ఏదైనా పని చేయాలనుకొని.. దాని కోసం పూర్తిగా కష్టపడితే కచ్చితంగా విజయం సాధించవచ్చు. చాలా మంది చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగం సాధించాలని కలలుగంటారు. విదేశాల్లో మంచి ఉద్యోగం.. మంచి శాలరీ ఉంటే ఎవరైనా వదులుకోవాలనుకుంటారా? అయితే చాలా మంది పెద్ద పెద్ద ప్యాకేజీల్ని వదులుకొని.. చిన్న చిన్న ఆలోచనలతో స్టార్టప్స్ ప్రారంభించిన వారు చాలా మంది ఉన్నారు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే అహానా గౌతమ్ కూడా అదే కోవలోకి వస్తుంది. రాజస్థాన్ భరత్‌పూర్ వాసి అయిన ఈమె అమెరికాలో మంచి ఉద్యోగం వదిలేసి స్వయంగా తానే ఒక స్టార్టప్ ప్రారంభించింది. ఆ కంపెనీ విలువ ఇప్పుడు ఏకంగా రూ. 100 కోట్లు దాటడం విశేషం. 30 ఏళ్ల వయసులోపే ఈ ఘనత సాధించిన యువతిగా నిలిచింది. ప్రస్తుతం బిజినెస్ వరల్డ్‌లో ఈమెకు ఒక ప్రత్యేకమైన స్థానం కూడా ఉంది.

స్టార్టప్ ఎలా ప్రారంభించారంటే?

అహానా అమెరికాలో ఉన్నప్పుడు బాగా బరువు పెరిగింది. అప్పుడు ఆమె ఒక హెల్దీ ఫుడ్ స్టోర్‌కు వెళ్లింది. అప్పుడే ఆమెకు హెల్దీ ఫుడ్ ప్రాముఖ్యత తెలిసొచ్చింది. అక్కడ స్టోర్‌లో ఎలాంటి జంక్ ప్రొడక్ట్స్ లేకపోవడం చూసి ఆశ్చర్యపోయింది. భారత్‌లో ఇలా ఎందుకు లేదా అని ఆలోచించింది. ఆ ఆలోచనే ఇప్పుడు స్టార్టప్ పెట్టేందుకు పునాది వేసింది. దీంతో హెల్దీ స్నాక్స్ బిజినెస్ స్టార్ట్ చేసింది. అమెరికాలో జాబ్ వదిలేసి తన తల్లి సపోర్ట్‌తో 2019లో బిజినెస్ వెంచర్ ఓపెన్ సీక్రెట్ ప్రారంభించింది. ఆమె తల్లి పెట్టుబడి, మద్దతుతోనే ఇది సాధ్యమైందని అహానా పలు సందర్భాల్లో చెప్పింది కూడా. సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఉన్న అహానాకు.. శుద్ధి చేసిన పంచదార, పిండి వాటి గురించి బాగా తెలుసు. అందుకే ఆమె తన ప్రొడక్ట్స్‌లో ఎలాంటి పిండి, పామాయిల్ వంటివి ఉంచొద్దని నిర్ణయించుకుంది. పూర్తి జంక్ ఫ్రీ ఫుడ్ ఆఫర్ చేసిందన్నమాట. ఈ స్నాక్స్‌లో విపరీతమైన పోషకాలు ఉండేలా చూసుకుంది. ప్రస్తుతం ఎన్నో స్టోర్లలో ఈ ఓపెన్ సీక్రెట్ ప్రొడక్ట్స్ అందుబాటులో ఉన్నాయి. స్వయంగా ఈ కంపెనీ కూడా వెబ్‌సైట్ నడుపుతోంది. ఇంకా ప్రముఖ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా కొనుగోలు చేయొచ్చు.

అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు..



ఓపెన్ సీక్రెట్ ఫౌండర్, సీఈఓ అయిన అహానా గౌతమ్ హార్డ్ వర్క్‌కు ఇప్పుడు భారత్ సహా ప్రపంచ స్థాయిలో గుర్తింపు దక్కుతోంది. అంతర్జాతీయ స్థాయిలో.. భారత స్టార్టప్స్‌కు కూడా చోటు దక్కుతుందన్న దానికి ఆమె స్థాపించిన కంపెనీనే నిదర్శనం అని చాటింది. చిన్న ఆలోచనతో బిజినెస్ ప్రారంభించి మూడేళ్లలోనే రూ. 100 కోట్ల టర్నోవర్ దాటించడం విశేషం. ఆమె చదువు విషయానికి వస్తే 2010లో ఐఐటీ బాంబేలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్ డిగ్రీ పొందింది. తర్వాత పైచదువుల కోసం అమెరికా వెళ్లింది. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో పూర్తి చేసింది. తర్వాత పలు ఉద్యోగాలు చేసింది.

# నెలకు రూ. 3 వేలు చాలు..



స్టాక్ మార్కెట్ల కంటే మ్యూచువల్ ఫండ్లలో రిస్క్ కాస్త తక్కువ ఉంటుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్న్స్ అందుకోవచ్చని నిపుణులు చెబుతుంటారు. ఇక్కడ కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ అనేది రాబడి పెరగడంలో కీలకంగా వ్యవహరిస్తుందన్న సంగతి తెలిసిందే. మ్యూచువల్ ఫండ్లలో సిప్ పెట్టుబడులతో దీర్ఘకాలంలో ఎంత రిటర్న్స్ పొందొచ్చో చూద్దాం. నెలకు ఎంత కడితే ఎంతొస్తుందో తెలుసుకుందాం.

స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే వారికి ఓపిక ముఖ్యం. అయితే ఇక్కడ రిస్క్ చాలానే ఉంటుంది. షేర్లు ఎక్కువగా ఫ్లక్చువేట్ అవుతుంటాయన్న సంగతి తెలిసిందే. అయితే స్టాక్ మార్కెట్లపై ఆసక్తి ఉన్న వారు నేరుగా స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం లేదు. మ్యూచువల్ ఫండ్లలో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ ద్వారా పెట్టుబడులు పెట్టి ప్రయోజనం పొందొచ్చు.

దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో నగదు సమకూర్చుకోవాలంటే సిప్ పెట్టుబడి అనేది ఒక మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. ఇక్కడ సిప్ (మ్యూచువల్ ఫండ్లు) పెట్టుబడి విధానంలో కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ (చక్రవడ్డీ) అంటే వడ్డీపై వడ్డీ వస్తుంది. దీంతో ప్రతి ఏటా రాబడి పెరుగుతూనే ఉంటుందని చెప్పొచ్చు. అందుకే చాలా మంది మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెడుతుంటారు.

మ్యూచువల్ ఫండ్లు అంటే.. ఇక్కడ నేరుగా స్టాక్ మార్కెట్లలో మనం పెట్టకుండా.. మన దగ్గర నిధులతో మ్యూచువల్ ఫండ్ కంపెనీలు నిర్దిష్ట స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. అలా మన రాబడి పెరుగుతుంటుంది. ఆర్థిక క్రమశిక్షణ ఉన్న వారు నెలనెలా కొంత మొత్తంలో పెట్టుబడి పెడుతుంటే మన రిటర్న్స్ పెరుగుతుంటాయి. సిప్ పెట్టుబడులతో భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. 60 ఏళ్ల తర్వాత స్థిర ఆదాయం పొందొచ్చు.

నెలనెలా ఎంత పెట్టుబడి పెట్టాలి?

ఉదాహరణకు మీరు 25 ఏళ్ల వయసులో ఉన్నారనుకుందాం. మీరు ఇప్పుడు నెలనెలా రూ. 3 వేల పెట్టుబడితో సిప్ ప్రారంభించాలి. ఇలా లాంగ్ టర్మ్ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పెద్ద మొత్తంలో మీ పెట్టుబడి మాత్రమే కాకుండా రిటైర్మెంట్ తర్వాత స్థిరంగా ఆదాయం అందుకోవచ్చు. 25 ఏళ్ల వయసులో నెలకు రూ. 3 వేల చొప్పున పెట్టుబడి పెట్టాలి. ప్రతి ఏటా 5 శాతం పెట్టుబడి పెంచుకుంటూ పోతూ 35 సంవత్సరాలు ఇన్వెస్ట్ చేయాలి. 35వ సంవత్సరం వరకు మీ ప్రతి నెలా పెట్టుబడి అనేది రూ. 15,760 కి చేరుతుంది. అంటే ఇక్కడ సిప్ ద్వారా తొలుత ఏడాదికి రూ. 36 వేల పెట్టుబడి 35వ సంవత్సరంలో రూ. 1.89 లక్షలకు చేరుతుంది. సగటున ఏడాదికి 12 శాతం రిటర్న్స్ అంచనా వేసినా కూడా 35 సంవత్సరాల్లో చూస్తే మీ మొత్తం పెట్టుబడి రూ. 32.51 లక్షలు కాగా.. ఇక్కడ రిటర్న్స్ రూ. 2.99 కోట్లుగా ఉంది. అంటే 35 ఏళ్ల పెట్టుబడులతో మీ దగ్గర రూ. 3 కోట్లు ఉంటాయి. ఈ పెద్ద మొత్తాన్ని రిటైర్మెంట్ ఫండ్‌లో పెట్టినా లేదా ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టినా తర్వాత ప్రతి నెలా చేతికి రూ. 1.50 లక్షల వరకు పొందొచ్చు.

# ఐటీ ఉద్యోగులకు కంపెనీల వార్నింగ్.. ఇదే లాస్ట్ ఛాన్స్..



ఐటీ ఉద్యోగులకు మంచి రోజులు ముగిసినట్లే కనిపిస్తోంది. కొవిడ్ విజృంభించినప్పటి నుంచి వర్క్ ఫ్రమ్ హెూం చేసిన ఉద్యోగులు.. ఇప్పుడు ఆఫీసులకు తప్పక రావాల్సిన పరిస్థితి. ఇప్పటికే పలు కంపెనీలు ఆఫీసులకు రావాలని ఉద్యోగులకు వార్నింగ్ కూడా ఇస్తున్నాయి. మరోవైపు లేఆఫ్స్ ఆందోళన కలిగిస్తుండగా.. ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉద్యోగులు ఉన్నారు. కొంతకాలంగా భారత దిగ్గజ ఐటీ కంపెనీలు ఒడుదొడుకుల్లో ఉన్నాయి. ఆర్థిక మందగమనం నేపథ్యంలో.. పెద్ద పెద్ద ఆర్డర్లు లేక సతమతం అవుతున్నాయి. దీంతో ఖర్చుల్ని తగ్గించుకునే ప్రణాళికలో ఉన్నాయి. దీంట్లో భాగంగానే ఒకవైపు లేఆఫ్స్ చేస్తూ.. మరోవైపు ఉద్యోగుల్ని ఆఫీసులకు రప్పిస్తున్నాయి. మార్చి చివరికల్లా ఉద్యోగులు వారంలో 5 రోజులు ఆఫీసులకు వచ్చి పనిచేయాలని.. లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పింది అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (%ఙూ%). వారికి ఇదే లాస్ట్ ఛాన్స్ అని చెప్పింది. వాస్తవానికి గతేడాది అక్టోబర్ నుంచి 5 రోజుల పని తప్పనిసరి చేసినా ఉద్యోగులు అంతా ఇది పాటించడం లేదు. ఇక ఉద్యోగులు వారంలో కనీసం 3 రోజులు.. ఫ్రెషర్స్ 5 రోజులూ ఆఫీసులకు రావాల్సిందేనని చెప్పింది హెచ్‌సీఎల్ టెక్నాలజీస్. ఇవి మాత్రమే కాదు.. ఇతర ఐటీ సంస్థలు ఇన్ఫోసిస్, విప్రో, ఒరాకిల్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హెూం విధానానికి స్వస్తి పలకాలని చూస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హెూంతో ఉత్పాదకత ఏం తగ్గలేదని కరోనా సయంలో పేర్కొన్న కంపెనీలే ఇప్పుడు.. ఆఫీసులకు వచ్చి టీమ్‌గా పనిచేస్తేనే వినూత్నత, ఉత్పాదకత పెరుగుతాయని చెబుతుండటం విశేషం. ఇప్పటికే టెక్ రంగంలో నియామకాలు తగ్గడం సహా విదేశాల్లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు లేఆఫ్స్‌కు గురవుతున్న తరుణంలో ఇక్కడి ఉద్యోగులు కంపెనీల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నారు. ఇక ఊళ్ల నుంచి ఉద్యోగుల కుటుంబాలు తరలి వస్తున్న నేపథ్యంలో.. ఐటీ కంపెనీల సమీప ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు పెరిగిపోతున్నాయి. మునుపటి వైభవం కనిపిస్తోంది. కొవిడ్‌కు చాలా కంపెనీలు ఉద్యోగులకు పూర్తి స్థాయిలో వర్క్ ఫ్రమ్ హెూం అవకాశం ఇవ్వగా.. ఇంకొన్ని మాత్రం వారంలో కొన్ని రోజుల పాటు వర్క్ ఫ్రమ్ హెూం వెసులుబాటు కల్పించాయి. అప్పట్లో పలు ఐటీ కంపెనీలు నిర్వహణ వ్యయాలు తగ్గించుకునేందుకు.. అద్దె భవనాల్ని ఖాళీ చేశాయి. తర్వాత హైబ్రిడ్ మోడల్ అమలు చేశాయి. ఇప్పుడు పూర్తిగా ఆఫీసులకు రావాలని ఒత్తిడి చేస్తుండగా.. ఉద్యోగులకు మరో దారి లేకుండా పోయింది. ఆశించిన స్థాయిలో కొత్త ప్రాజెక్టులు లేకుంటే.. మన దగ్గర కూడా పరిస్థితులు శరవేగంగా మారే ప్రమాదం ఉంది. మరోవైపు కృత్రిమ మేధ ప్రభావంపై అంచనాలు మాత్రం ఇంకా కలవరపెడుతున్నాయి. కొత్త నియామకాలు తగ్గినందున.. ఉద్యోగులు ఇతర కంపెనీలకు మారదామనుకున్నా ఆశాజనక పరిస్థితులు మాత్రం కనిపించడం లేదు. రోజూ ఆఫీసులకు రావడానికి ఎక్కువ శాతం ఉద్యోగులు మాత్రం ఆసక్తి చూపించట్లేదట. ముఖ్యంగా 25 నుంచి 34 ఏళ్ల మధ్య వయసు ఉద్యోగులు విముఖత ప్రదర్శిస్తున్నట్లు ఒక సర్వేలో తేలింది.

# ఇడ్లీ, చనా మసాలతో జీవవైవిధ్యానికి ముప్పు!



ఆహారం ప్రతి జీవికి ప్రాథమిక అవసరం. ఒక్కో జీవికి ఒక్కో రకమైన ఆహారపు అలవాటు ఉంటుంది. కానీ ఏదో ఒక దశలో ఒక ప్రతి జీవి ఇంకో జీవికి ఆహారంగా ఉపయోపడటం ఈ ఆవరణ వ్యవస్థలోని ప్రత్యేక లక్షణం. ఆ మన ఆహారపు అలవాట్లు జీవవైవిధ్యానికి విఘాతం కలిగిస్తున్నాయి. గతంలో మాంసాహారం వల్లే పర్యావరణానికి ముప్పు ఉందని పలు అధ్యయనాలు తేల్చి చెప్పాయి. తాజాగా, శాకాహారం కూడా తక్కువేం కాదని వెల్లడయ్యింది. భారతీయులు ముఖ్యంగా దక్షిణాదివాసులు ఇష్టంగా తినే బ్రేక్‌ఫాస్ట్‌లో ఇడ్లీదే అగ్రస్థానం. వేడి వేడి ఇడ్లీలో.. కొద్దిగా నెయ్యి, కారంపొడి తగిలించి, కొబ్బరి చట్నీతో తింటే.. ఆహా ఆ రుచి మాటల్లో చెప్పలేం. మరి అలాంటి ఇడ్లీ వల్ల జీవవైవిధ్యానికి ముప్పు పొంచి ఉందా? అంటే అవునని అంటోంది ఓ అధ్యయనం. కేవలం ఇడ్లీ మాత్రమే కాదు ప్రపంచవ్యాప్తంగా 151 వంటకాలు జీవ వైవిధ్యానికి ముప్పుగా పరిణమించాయని తాజా అధ్యయనం వెల్లడించింది. వాటిలో ఇడ్లీతోపాటు పలు భారతీయ వంటకాలు ఉన్నాయి. చనా మసాలా, రాజ్మా, చికెన్ జాల్‌ఫ్రెజి వంటివి పర్యావరణానికి ముప్పుగా పరిణమించే మొదటి 25 వంటకాల్లో ఉండటం గమనార్హం. వైవిధ్యానికి విఘాతం కలిగించే వంటకాల జాబితాలో స్పానిష్ రోస్ట్ ల్యాంబ్ డిష్ 'లెచాజో' అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానంలో బ్రెజిల్‌కు చెందిన మీట్ సెంట్రిక్ ఆఫెరింగ్స్ ఉండగా.. ఇడ్లీ ఆరో స్థానంలో, రాజ్మా కూర ఏడో స్థానంలో ఉన్నాయి. ఈ అధ్యయన ఫలితాలను సింగపూర్ యూనివర్సిటీ ఎలిస్సా చెంగ్ అండ్ కొలీగ్స్ ఆధ్వర్యంలో నడిచే ఓపెన్ యాక్సెస్ జర్నల్ ప్లాస్ (పీఎల్‌వోఎస్)లో ప్రచురించారు. అయితే,మాంసాహార వంటకాలతో పోల్చితే శాకాహారులు, శాకాహార వంటకాలు తక్కువ జీవ వైవిధ్య ఫుట్‌ప్రింట్స్ కలిగి ఉండటం ఆశ్చర్యకరం. కానీ, బియ్యం, పప్పుధాన్యాల ఆధారిత వంటకాలు కూడా అధిక స్కోరు సాధించడం శాస్త్రవేత్తలను విస్మయానికి గురిచేసింది. 'భారత్‌లో ఎక్కువగా వినియోగించే చిక్కుళ్లు, బియ్యం వంటివి ఎక్కువ ప్రభావం చూపుతున్నట్టు వెల్లడికావడం ఆశ్చర్యాన్ని కలిగించాయి.. కానీ వాటి దాని గురించి ఆలోచించినప్పుడు అర్థమవుతుంది' అని అధ్యయనం పేర్కొంది. వ్యవసాయం క్షేత్రాల్లో క్షీరదాలు, పక్షులు, ఉభయచర జీవులపై పడే ప్రభావాన్ని కరాస్కో, అతడి సహచరులు అంచనా వేశారు. బియ్యం, పప్పుధాన్యాలతో కూడిన ఆహారం వల్ల జీవ వైవిధ్యంపై అధిక ప్రభావం పడుతుందని అధ్యయనంలో తేలింది. మన దేశంలో ధాన్యం, పప్పు ధాన్యాల సాగుకు తరచుగా భూమార్పిడి అవసరమని, ఈ కారణంగా అనేక జీవజాతులు ఆవాసాలు కోల్పోతున్నా యని అధ్యయనం ఆందోళన వ్యక్తం చేసింది. ఆహారం ఎంపిక సాధారణంగా రుచి, ధర, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది, అయితే వంటకాలకు జీవవైవిధ్య ప్రభావ స్కోర్‌లను కేటాయించే అధ్యయనాలు పర్యావరణ స్పృహ ఉన్న వ్యక్తులు తమ ఆహార ఎంపికలను రూపొందించడంలో సహాయపడతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రధానంగా వ్యవసాయాన్ని విస్తరించడం వల్ల ఏర్పడే ఆవాసాలు, జీవవైవిధ్య నష్టం గురించి ఆందోళనల నేపథ్యంలో ఈ అధ్యయనం రావడం గమనార్హం. కుటుంబ సగటు ఆహార వినియోగం దాని పర్యావరణ ప్రభావంలో 20 నుంచి 30 శాతం వరకు ఉంటుందని మునుపటి అధ్యయనం అంచనా వేసింది. 'మా విశ్లేషణలో జీవవైవిధ్య ముప్పు ఆ వంటకాన్ని ఉత్పత్తి చేయడానికి కనీసం పాక్షికంగా ప్రభావితమైన జాతుల మొత్తాన్ని లెక్కించింది' అని కరాస్కో చెప్పారు. ఆ వంటకాన్ని తినడం ద్వారా మనం ఎన్ని జాతులను అంతరించిపోయేలా చేస్తున్నామో ఒక అవగాహన కల్పిస్తుందని వ్యాఖ్యానించారు. అయితే, గతంలో పలు అధ్యయనాలు మాంసాహార ఆహారం వల్ల పర్యావరణానికి ముప్పు ఉందని హెచ్చరించాయి.

# అన్నీ తెలిసే సిరియాకు ప్రయాణం.. 'ఐసిస్ పెళ్లికూతురి'కి మరోసారి షాకిచ్చిన కోర్టు

ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐసిస్) ఉగ్రవాదులను నరరూప రాక్షసులుగా చెబుతారు. 2015 నుంచి వారి అరాచకాలు రోజు రోజుకూ శ్రుతిమించుతున్నాయి. ఆన్‌లైన్ ద్వారా వివిధ దేశాలకు చెందిన యువత ఆకర్షించి, ఉగ్రవాదులుగా మార్చుతున్న ఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక, ఐసిస్ ఉచ్చులో పడి ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అలాంటి వారిలో యూకేకు చెందిన షమీమా బేగం అనే యువతి కూడా ఒకరు.

పదిహేనేళ్ల వయసులో సిరియాకు పారిపోయి ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలో చేరిన బ్రిటన్‌కు చెందిన షమీమా బేగం.. తిరిగి యూకే పౌరసత్వం కోసం న్యాయపోరాటం చేస్తోంది. ఇస్లామిక్ ఉగ్రవాదిని వివాహం చేసుకున్న ఆమెను 'ఐసిస్ పెళ్లికూతురు'గా వ్యవహరించేవారు. తనను తిరిగి బ్రిటన్ పౌరురాలిగా గుర్తించాలని కోరుతూ షమీమా బేగం వేసిన పిటిషన్‌ను 'స్పెషల్ ఇమిగ్రేషన్ అప్పీల్స్ కమిషన్ గతంలో తిరస్కరించింది. తాజాగా, అప్పీల్ కోర్టు ఎస్ఐఏసీ తీర్పుతో ఏకభవించింది. ఆమె అన్నీ తెలిసే సిరియాకు వెళ్లి ఉగ్రవాదులతో చేరాలని నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించింది. 'షమీమా బేగంను ఇతరులు ప్రభావితం చేసి ఉండొచ్చు.. కానీ, సిరియాకు వెళ్లి ఉగ్రవాద సంస్థలో చేరే అంశంలో అన్నీ తెలిసే నిర్ణయం తీసుకున్నారు' అని పేర్కొంది. 24 ఏళ్ల షమీమా ప్రస్తుతం ఉత్తర సిరియాలోని శరణార్థి శిబిరంలో తలదాచుకుంటోంది. బంగ్లాదేశ్ సంతతికి చెందిన షమీమా బేగం 2015 ఫిబ్రవరిలో యూకే నుంచి సిరియాకు వెళ్లిపోయింది. తూర్పు లండన్‌లోని బెథ్నల్ గ్రీన్ పాఠశాలలో చదువుతున్న ఆమె వయసు అప్పటికి 15 ఏళ్లు. ఆమె వెంట మరో ఇద్దరు బాలికలు కూడా వెళ్లారు. అక్కడే డచ్‌కు చెందిన ఐసిస్ ఉగ్రవాది యగో రీడ్జిక్‌ను పెళ్లి చేసుకుంది. దాంతో షమీమాను 'ఐసిస్ పెళ్లికూతురు' అని పిలిచేవారు. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టినా.. ఒక్కరు కూడా దక్కలేదు. అయితే, 2019 ఫిబ్రవరిలో సిరియా శరణార్థుల శిబిరంలో ఆమె ప్రత్యక్షం కావడంతో బ్రిటన్ హెూంశాఖ ఆమె పౌరసత్వాన్ని రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆమె కోర్టును ఆశ్రయించింది. అయితే, తిరిగి స్వదేశంలో అడుగుపెట్టడానికి షమీమాకు అవకాశం కల్పించకూడదంటూ 2021లో యూకే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.



జాతీయ భద్రత ముందు ఏదీ ప్రధానం కాదని, ఆమె పౌరసత్వాన్ని రద్దు చేయడం సబబేనని హెూంశాఖ నిర్ణయాన్ని సమర్థించింది. దీనిపై ఆమె అప్పీల్‌కు వెళ్లగా 2022లో తన నిర్ణయం సరైందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో స్పెషల్ ఇమిగ్రేషన్ అప్పీల్స్ కమిషన్ ఆశ్రయించిన షమీమా.. తాను మానవ అక్రమ రవాణా బాధితురాలిగా చెప్పుకొంది. అయితే, పౌరసత్వం రద్దుకు హెూంశాఖ ఈ విషయాన్ని పరిగణించాల్సిన అవసరం లేదని కమిషన్ తీర్పు చెప్పింది. దీన్ని సవాల్ చేయగా మరోసారి న్యాయమూర్తులు ఏకగ్రీవంగా తీర్పును సమర్థించారు. షమీమా బ్రిటీష్ పౌరసత్వాన్ని తొలగించే నిర్ణయం కఠినమైందా లేదా ఆమె తన దురదృష్టానికి బలైందా అని నిర్ణయించడం న్యాయస్థానం పని కాదు అని వ్యాఖ్యానించారు. 'షమీమా బేగం ఇతరులతో ప్రభావితమై ఉండొచ్చు.. ఎవరైనా నియంత్రించి ఉండొచ్చు.. కానీ అన్నీ తెలిసిన తర్వాతే సిరియాకు వెళ్లి ఐసిస్‌తో జతకట్టడానికి నిర్ణయం తీసుకుంది' అని న్యాయమూర్తి జస్టిస్ డేమ్ స్యూ కార్ అన్నారు. మరోవైపు, ఆమె బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ కోరుతుందని బ్రిటన్ ప్రభుత్వం పేర్కొంది. కానీ, ఆమె కుటుంబసభ్యులు మాత్రం యూకే పౌరురాలైన తమ కుమార్తె బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ ఎప్పుడూ కోరలేదని చెప్పింది.

# తెలుగమ్మాయి జాహ్నవి యాక్సిడెంట్ కేసు..

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాకు చెందిన కందుల జాహ్నవి 2023 జనవరి 23న సియాటెల్‌లోని పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవేపై నేరాభియోగాలు మోపడం లేదని అమెరికా అధికారులు ఇటీవల ప్రకటించారు. సాక్ష్యాధారాలు లేకపోవడమే అందుకు కారణమని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ కార్యాలయం బుధవారం వెల్లడించింది. దీనిపై సీనియర్ అటార్నీలతో విచారణ జరిపిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొంది. గతేడాది జనవరి 23న అమెరికాలోని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జాహ్నవి కందుల మృతికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవేపై నేరాభియోగాలు మోపడం లేదని అక్కడి అధికారులు ప్రకటించిన విషయం తెలిసిందే. డేన్ పాత్రపై సాక్ష్యాధారాలు లేవని చెబుతూ అటార్నీ కార్యాలయం పేర్కొంది. తాజాగా, ఈ ప్రటకనపై భారత్ స్పందించింది. నేరాభియోగాలు నమోదుచేయకూడదనే అంశాన్ని సమీక్షించాలని శనివారం సియాటెల్ భారత రాయబార కార్యాలయం కోరింది. ఈ విషయంలో సంబంధిత అధికారులతో



సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపింది. 'జాహ్నవి కందుల కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేస్తున్నాం.. తగిన పరిష్కారం కోసం ఈ కేసు గురించి స్థానిక అధికారులు, సియాటెల్ పోలీసుల వద్ద గట్టిగా లేవనెత్తాం... ప్రస్తుతం ఈ కేసును సమీక్ష కోసం సియాటెల్ అటార్నీ కార్యాలయానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.. దర్యాప్తు నివేదిక కోసం వేచిచూస్తున్నాం.. ఈ విషయంలో సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం' అని సియాటెల్‌లోని భారత రాయబార కార్యాలయం. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన కందుల జాహ్నవి 2023 జనవరిలో సియాటెల్‌లోని పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొని మృతిచెందిన విషయం తెలిసిందే. సాక్ష్యాధారాలు లేకపోవడంతో డవేపై అభియోగాలు మోపడం లేదని పేర్కొంటూ.. కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ కార్యాలయం ఇటీవల చేసిన ప్రకటన తీవ్ర నిరుత్సాహానికి గురిచేసింది. సీనియర్ అటార్నీలతో దీనిపై విచారణ జరిపిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపింది. మరోవైపు, జాహ్నవి మృతిని తక్కువ చేస్తూ హేళనగా మాట్లాడిన మరో పోలీసు అధికారి డేనియల్ అడెరెర్ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ లేదని కింగ్ కౌంటీ ప్రాసిక్యూటింగ్ అటార్నీ తెలిపారు. అధికారిపై ఇప్పటికే చర్యలు తీసుకుని, సస్పెన్షన్ వేటువేసిన విషయం తెలిసిందే. అతనిపై తుది విచారణ మార్చి 4న జరగనుంది. ఇక, 120 కి.మీ. వేగంతో వచ్చిన పోలీస్ పెట్రోలింగ్ వాహనం జాహ్నవి ఢీకొట్టి ఆమె పై నుంచి వెళ్లింది. ఈ కేసు దర్యాప్తుపై పోలీసు అధికారి డేనియల్ అడెరెర్.. చులకనగా మాట్లాడుతూ పగలబడి నవ్విన వీడియో ఒకటి కొన్ని నెలల కిందట వైరల్ అయ్యింది.






# సాయిపల్లవితో నటించాలంటే భయం : చైతన్య

టాలీవుడ్ అగ్ర కథానాయికలలో సాయిపల్లవి ఒకరు. భానుమతి హైబ్రిడ్ పిల్లా అంటూ ఫిదా సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే కుర్రకారు మనసులను దోచుకుంది ఈ భామ. అనంతరం మిడిల్ క్లాస్ అబ్బాయి, పడి పడి లేచే మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం తదితర చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమాలో నటిస్తుంది. అయితే రీసెంట్‌గా ఒక టాక్ షోలో పాల్గొన్న నాగ చైతన్య సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దగ్గుబాటి హోస్ట్‌గా చేస్తున్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న ఈ షోలో రీసెంట్‌గా నాగ చైతన్య గెస్ట్‌గా వచ్చాడు. అయితే షోలో భాగంగా రానా సాయి పల్లవి గురించి అడుగగా.. చైతూ మాట్లాడుతూ.. సాయిపల్లవితో నటించాలి అన్న.. డాన్స్ చేయాలన్న భయం వచ్చేస్తది బావ (రానా). నువ్వు సాయిపల్లవితో విరాట పర్వం సినిమా చేసి ఒక్క సాంగ్ కూడా పెట్టకుండా భలే తప్పించుకున్నావు. కానీ నాకు అలా లేదు తనతో చేసేటప్పుడు నేను బానే చేస్తున్నానా అని సందేహం వస్తుంది అంటూ నాగ చైతన్య చెప్పుకొచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.





# పుష్ప.2కు అండగా నిలిచన జాన్వీకపూర్

అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమాకు హాలీవుడ్ చిత్రం ఇంటర్‌స్టెల్లార్ సినిమాకు సంబంధించి ఉత్తరాదిలో వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఇంటర్‌స్టెల్లార్. 2014లో విడుదలైన ఈ చిత్రం హాలీవుడ్‌లోనే కాకుండా ఇండియాలోను మంచి కలెక్షన్లు సాధించింది. అయితే ఈ సినిమా 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ రీ రిలీజ్ ప్లాన్ చేశారు. ఈ సినిమాను ఐమాక్స్ వెర్షన్ మాత్రమే రిలీజ్ చేయనుండగా.. ఇండియాలో కాకుండా వరల్డ్ వైడ్‌గా విడుదల చేస్తుంది చిత్రబృందం. దీనికి ముఖ్య కారణం ఇండియాన్ ఐమాక్స్‌ల్లో 'పుష్ప 2' ఉండటం. దీంతో ఇండియన్స్‌కు అసలు సినిమాలు చూడడం రాదని.. సైన్స్ ఫిక్షన్ వదిలేసి మాస్ సినిమాలకు ఎంకరేజ్ చేస్తున్నారని కొందరూ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వివాదంపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్పందిస్తూ.. 'పుష్ప2' సినిమాకు మద్దతుగా నిలిచింది. జాన్వీ మాట్లాడుతూ.. 'పుష్ప 2' కూడా ఒక సినిమానే కదా.. ఇంటర్‌స్టెల్లార్ సినిమాతో ఈ సినిమాను పోలుస్తూ ఎందుకు తక్కువ చేస్తున్నారు. ఏ హాలీవుడ్ సినిమాను మీరు సపోర్ట్ చేస్తున్నారో వాళ్లే ఇప్పుడు ఇండియన్ సినిమాల గురించి చర్చించుకుంటున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ మనం మాత్రం మన సినిమాలను తక్కువ చేసుకుంటూ మనల్ని మనమే అవమానించుకుంటూ ఉండిపోతున్నాం. ఇలాంటివి చూసినప్పుడు బాధగా ఉంటుంది అంటూ జాన్వీ రాసుకోచ్చింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.

# తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా దిల్‌రాజు



టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవి కల్పించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయనను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యార్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ఈ పదవిలో రెండేండ్ల పాటు కొనసాగనున్నారు. దిల్ రాజు అసలు పేరు వెంకటరమణా రెడ్డి. 1990లో పెళ్లి పందిరి సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించారు. అనంతరం దిల్ సినిమాతో నిర్మాతగా మారారు. ఆ చిత్రం విజయం సాధించడంతో ఆయన పేరు దిల్ రాజుగా మారింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై సినిమాలు నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్ సినిమాలే కాకుండా చిన్ని చిత్రాలు కూడా నిర్మిస్తూ అనేకమందికి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్నవారిని ప్రోత్సహించేందుకు గాను దిల్ రాజు డ్రీమ్స్ పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభిస్తున్నానని ఇటీవలే ప్రకటించారు. దీనికోసం ఒక వెబ్‌సైట్‌ను కూడా లాంచ్ చేయనున్నారు. ఆయన ప్రస్తుతం మూడు సినిమాలకు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అగ్రదర్శకుడు శంకర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో ఆయన నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ చేంజర్' జనవరి 10న, వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్నాయి. వీటితోపాటు వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'తమ్ముడు' సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్నారు.



# హీరోయిన్‌ను పెళ్లాడిన కలర్‌ఫొటో డైరెక్టర్

కలర్ ఫొటో సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు సందీప్ రాజ్, నటి చాందినీ రావు మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. తిరుమలలో వీరిద్దరి పెళ్లి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో సుహాస్ దంపతులతో పాటు నటుడు వైవా హర్ష తదితరులు హాజరై సందడి చేశారు. సందీప్ పెళ్లికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కలర్‌ఫొటో సినిమాతో డైరెక్టర్‌గా మంచి ఫేం సంపాదించాడు సందీప్ రాజ్. ప్రముఖ యూట్యూబ్ ఛానల్ ఛాయి బిస్కెట్‌లో షార్ట్ ఫిలిమ్స్‌తో కెరీర్ మొదలుపెట్టిన ఈ యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ డెబ్యూ సినిమాగా కలర్ ఫొటో ఓటీటీలో విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది. నటి చాందీని రావు విషయానికి వస్తే.. కలర్‌ఫొటో, రణస్థలి, హెడ్ అండ్ టేల్స్‌తోపాటు పలు వెబ్ సిరీస్‌లలో నటించించింది. చాందిని రావు ప్రొడక్షన్ హౌస్‌ను కూడా మెయింటైన్ చేస్తుంది. సందీప్ రాజ్ ప్రస్తుతం రోషన్ కనకాలతో సినిమా ప్రకటించాడని తెలిసిందే. ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే షూటింగ్ షురూ కానున్న ఈ చిత్రం 2025లో విడుదల కానుంది.

# ప్లీజ్ అలాంటి సినిమాలు తీయొద్దు : అమీర్‌ఖాన్



పురుషాధిక్యాన్ని, పితృస్వామ్య భావనలను ప్రతిబింబించే సినిమాలను తాను వ్యతిరేకిస్తానని, అలాంటి కథలు సమాజాన్ని కొన్ని ఏళ్లు వెనక్కి తీసుకెళ్తాయని వ్యాఖ్యానించారు బాలీవుడ్ అగ్ర నటుడు, మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్. ఇటీవల ఓ అంతర్జాతీయ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పైవిధంగా స్పం దించారు. 'గతకొంతకాలంగా మేల్ డామినేట్ స్టోరీస్ ఎక్కువగా వస్తున్నాయి. దశాబ్దాల కిందటే సమసిపోయిన పితృస్వామ్య భావాలను ప్రోత్సహించే కథాంశాలను తెరకెక్కిస్తున్నారు. అలాంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. ఇప్పుడు సమాజం అన్ని రంగాల్లో ఆధునిక ఆలోచనలతో పురోగమిస్తున్నది. అయినా ఇప్పటికీ పరిష్కారించాల్సిన సామాజిక సమస్యలున్నాయి. వాటిపై దృష్టి పెడితే సమాజ అభ్యున్నతికి సృజనాత్మక మార్గంలో సహాయం చేసినవాళ్లమవుతాం. స్త్రీకి కొంతమేరకే స్వేచ్ఛనివ్వాలనే ఆలోచనలు పురుషుల్లోని అభద్రతాభావాన్ని సూచిస్తాయి. నేటి స్త్రీలు స్వీయ నిర్ణయాలతో ముందుకెళ్తున్నారు. వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషలపై ఉంది' అని అమీర్ వ్యాఖ్యానించారు. స్త్రీ సాధికారత ప్రధానాంశంగా ఆయన నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం ప్రశంసలతో పాటు ఈ ఏడాది భారత్ నుంచి ఆస్కార్ బరిలో పోటీపడుతున్న అధికారిక చిత్రంగా నిలిచింది. ప్రస్తుతం అమీర్‌ఖాన్ 'తారే జమీన్ పర్' సీక్వెల్‌ను తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది విడుదల కానుంది.



# ఇంకేప్పుడు నటించొద్దు అన్నారు..? : రష్మిక

పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు రష్మిక. ప్రస్తుతం రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్, కుబేర, సికిందర్, ఛావా, థామ చిత్రాల్లో నటిస్తూ ఆమె బిజీబిజీగా ఉన్నది.

# చిరంజీవి విశ్వంభరా ఆరోజైనా..?



చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే..

అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు.